# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 24-03-2025** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ప్రజల ఆరోగ్య సంరక్షణ కు కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని రాష్ట్ర మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు తెలిపారు.**
2. **రాష్ట్రంలోని మున్సిపల్ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించనున్నట్లు మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ పేర్కొన్నారు.**
3. **ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినం సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా అవగాహనా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.**
4. **పార్లమెంటు ప్రాంగణంలో ఆంధ్రప్రదేశ్ గిరిజన కోఆపరేటివ్ సొసైటీ ఆధ్వర్యంలో రెండు అరకు కాఫీ స్టాళ్లను ఏర్పాటు చేశారు.**
5. **అకాల వర్షాల వల్ల పంట నష్టపోయిన ప్రతీ రైతుకు ప్రభుత్వం సహాయం అందించాలని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు.**

==========================

పేద ,మద్యతరగతి ప్రజల ఆరోగ్య సంరక్షణకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులో మంత్రి ఈరోజు 28 మంది లబ్దిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి 12 లక్షల 60 వేల రూపాయల విలువైన చెక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రామానాయుడు మాట్లాడుతూ...ప్రతి ఒక్కరికీ ఆరోగ్య సేవలు అందుబాటులో ఉండేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఆపద సమయంలో అత్యవసరంగా అప్పు చేసి వైద్యం చేయించుకున్న పేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఆసరా ఇస్తుందని మంత్రి తెలియజేస్తూ...

..వాయిస్ .. 35 సెకన్లు....

--------------------------

రాష్ట్రంలోని మున్సిపల్ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించి అభివృద్ధి చేయనున్నట్లు రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ తెలిపారు. నెల్లూరు సిటీ నియోజకవర్గ పరిధిలోని వివిధ మున్సిపల్ పాఠశాలలు.. పార్కులను ఆయన ఈ రోజు పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో చేపట్టవలసిన అభివృద్ధి పనులకు సంబంధించి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ... పాఠశాలల అభివృద్ధికి సంబంధించి రాష్ట్ర విద్యాశాఖ మంత్రి లోకేష్‌తో

చర్చించామన్నారు. వచ్చే విద్యా సంవత్సరంలో మరింత మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలకు వచ్చేలా చర్యలు తీసుకుంటామని మంత్రి తెలియజేశారు.

-----------------------------

ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినం సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల్లో వైద్యాధికారులు, జిల్లా అధికారులు అవగాహనా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. తిరుపతిలో జరిగిన అవగాహనా ర్యాలీని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి బాలక్రిష్ణ నాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షయవ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తిస్తే సులువుగా నయం చేయవచ్చన్నారు. క్షయ వ్యాధి గ్రస్తులకు ప్రభుత్వం ఉచితంగా మందులను కూడా పంపిణీ చేస్తోందన్నారు.

అనంతపురం జిల్లాలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహనా ర్యాలీలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ఈ.బి. దేవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గత సంవత్సర కాలంలో టిబి వ్యాధి నివారణ కార్యక్రమంలో ఉత్తమ ప్రతిభ కనబరచిన వారికి టిబి ముక్తి భారత కార్యక్రమంలో ఎంపికైన పంచాయతీలకు బహుమతి ప్రధానం చేయడం జరిగిందని తెలిపారు.

-----------------------------

సరైన ఆరోగ్య సంరక్షణ ద్వారా క్షయ వ్యాధిని నయం చేయవచ్చునని ఎన్ టి ఆర్ జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుహాసిని అన్నారు. ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా ఈరోజు స్థానిక ప్రభుత్వాసుపత్రి నుంచి కంట్రోల్ రూమ్ సెంటర్ వరకూ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్షయ వ్యాధిపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని, జాగ్రత్త వహిస్తే వ్యాధి పూర్తిగా నయమవుతుందని తెలిపారు. జిల్లాలో అన్ని ప్రభుత్వాసుపత్రుల్లో టిబి నిర్ధారణ పరీక్షలు అందుబాటులో ఉన్నాయని వివరిస్తూ...

..వాయిస్ .. 36 సెకన్లు

-----------------------------

అకాల వర్షాల వల్ల నష్టపోయిన ప్రతీ రైతుకు ప్రభుత్వం సహాయం అందించాలని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. వైఎస్సార్ జిల్లాలో ఆయన ఈరోజు పర్యటించి... తాతిరెడ్డిపల్లిలో అకాల వర్షం కారణంగా పడిపోయిన అరటి పంటలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ, ఇన్స్యూరెన్స్ ఇవ్వాలన్నారు. కూటమి ప్రభుత్వంలో ఉచిత పంటల బీమాను తీసేశారని ఆరోపించారు.

-----------------------------

దేశవ్యాప్తంగా అరకు కాఫీ బ్రాండ్ కు విస్తృత ప్రచారం కల్పించడంలో భాగంగా...పార్లమెంటు ప్రాంగణంలో ఆంధ్రప్రదేశ్ గిరిజన కోఆపరేటివ్ సొసైటీ ఆధ్వర్యంలో రెండు కాఫీ స్టాళ్ళు ఏర్పాటు చేశారు. లోక్‌సభ అల్పాహార క్యాంటీన్ సంగం-1లో... అరకు కాఫీ స్టాల్‌ను పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు, రాజ్యసభ క్యాంటీన్‌లో వాణిజ్య వ్యవహారాల శాఖ మంత్రి పీయూష్ గోయల్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గిరిజన వ్యవహారాల శాఖ మంత్రి జోయల్ ఓరం, కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, పలువురు పార్లమెంటు సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ... సుమారు లక్షా యాభైవేల మంది

రైతులు ఆర్గానిక్ పద్దతిలో అరకు కాఫీని తయారు చేస్తున్నట్లు వివరిస్తూ....

..వాయిస్: 37 సెకన్లు....

-----------------------------

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఏప్రిల్ ఒకటో తేదీన బాపట్ల జిల్లా పర్చూరు నియోజకవర్గంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేయనున్నారు. చినగంజాం మండలం పెదగంజాం పరిధిలోని గొల్లపల్లిలో నిర్వహించనున్న పింఛన్ల పంపిణీ, ప్రజావేదిక కార్యక్రమాల్లో పాల్గొంటారని అధికారులు తెలిపారు. తొలుత లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి.. పింఛన్లు అందజేసి, ప్రజా వేదిక కార్యక్రమంలో పాల్గొంటారని పర్చూరు శాసన సభ్యులు ఏలూరి సాంబశివరావు తెలిపారు. అనంతరం అధికారులతో సమావేశమై జిల్లా అభివృద్ధిపై సమీక్ష నిర్వహిస్తారని కలెక్టర్ వెంకట మురళి పేర్కొన్నారు.

-----------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 120వ సంచిక ఈ నెల 30వ తేది ఆదివారం ప్రసారం అవుతుంది."మన్ కీ బాత్" కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు ఈనెల 28వ తేదీ సాయంకాలం వరకు పంపవచ్చు.

-----------------------------

ఐపీఎల్ 18వ సీజన్‌లో ఈరోజు విశాఖపట్టణం వేదికగా రాత్రి 7 గంటల 30 నిమిషాలకు ఢిల్లీ క్యాపిటల్స్, లక్నో సూపర్ జెయింట్స్ మధ్య మ్యాచ్ జరగనుంది. ఈ మ్యాచ్ ను గవర్నర్ అబ్దుల్ నజీర్ సహా ఉత్తరాంధ్ర మంత్రులు, ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు వీక్షించనున్నారు. ప్రముఖుల రాకను దృష్టిలో ఉంచుకుని అధికారులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. మ్యాచ్ సందర్భంగా మధ్యాహ్నం 2 గంటల నుంచి ట్రాఫిక్ ఆంక్షలు విధించారు.

-----------------------------

రాష్ట్రంలోని ప్రస్తుత వాతావరణ పరిస్థితులను అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం అధికారి ఎం.వెంకట్రావు కొద్దిసేపటి క్రితం ఆకాశవాణి విజయవాడ కేంద్ర ప్రాంతీయ వార్తావిభాగానికి తెలియజేస్తూ......

.....వాయిస్.... 27 సెకన్లు....

-----------------------------

రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ఈ నెల 27న విజయవాడలో రాష్ట్రస్థాయి ఇఫ్తార్ వేడుకను ప్రభుత్వం నిర్వహించనుంది. దీనికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హాజరుకానున్నారు. జిల్లా కేంద్రాల్లోనూ కలెక్టర్ల ఆధ్వర్యంలో ఈ వేడుకలు నిర్వహిస్తారు. ఇందుకోసం 1.50 కోట్ల రూపాయలు కేటాయిసున్నట్లు మైనారిటీ మంత్రిత్వ శాఖ కార్యదర్శి హర్షవర్ధన్ నిన్న ఉత్తరులు జారీ చేశారు.

=====================